# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## దీక్షా దివస్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**సొంతంగా తెలంగాణ వొక రాష్ట్రమైతే అందరొలిగె మందిల కలిసి తమ బతుకులను బాగుచేసుకోవచ్చని తెలంగాణ బిడ్డలు ఆరు దశాబ్దాల పాటు ఆశపడ్డరు. ఆశను సావనీయకుంట అలుపులేని పోరాటాలను నడిపించిన్రు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేసుకునేందుకు తరాలకు తరాలే, జీవితాలకు జీవితాలే త్యాగాలు చేయవలసి వచ్చింది. రాచరిక పాలననుంచి ప్రజాస్వామిక పాలన దిశగా పయనిస్తున్న దేశ స్వాతంత్ర్య తొలిదశలోనే స్వయం పాలనను చేపట్టవలసిన తెలంగాణకు 66 ఏండ్ల తర్వాత కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ట్రమయ్యే అవకాశం వచ్చింది.**

తెలంగాణ ఎందుకు రాదో చూస్తనని జలదృశ్యంలో మొదటి దీక్ష పట్టి అదే మొదలుగా పద్నాలుగేండ్లు వనవాసం పోయినట్టు ఉద్యమ జనవాసాన్ని కొనసాగించిండు ముఖ్యమంత్రి కేసీఆర్. తన అలుపెరగని ఉద్యమ ప్రస్థానంలో భాగంగా తెలంగాణను ఐక్యం చేసిండు.



ఎప్పటికప్పుడు బొలపరిచ్చుడు మాటలు చెప్పి తెలంగాణ జనాల ఆకాంక్షలతోని కాంగ్రెస్ పార్టీ ఆడుకున్నది. అరవయేండ్ల సంది తెలంగాణ సమాజంతోని వోట్లేయించుకునుడు అక్కర తీరంగనే తప్పించుకునుడు. ఇట్లాంటి కాంగ్రెస్ ద్రోహపూరిత పరిస్థితుల్లో కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ కెరటాలై ఎగిసిపడుతున్న సందర్భంలో 'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో' అని స్వరాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29 నాడు కేసీఆర్ ఆమరణ దీక్ష పట్టిండు. ఉద్యమ సారథి కేసీఆర్ దీక్షకు మద్దతుగా యావత్ తెలంగాణ పిడికిలి బిగించింది. మేధావులు, సామాన్యులు, సర్వ వృత్తులు, సకల జనులు ఎక్కడివాల్లక్కడ ఉద్యమ నిప్పురవ్వలయింట్రు. వారు పెట్టిన ఉద్యమ మంట పల్లె పట్నం తేడాలేకుండా పోరాట దివిటీలను ఎలిగించి తెలంగాణ జైత్రయాత్రను సాగించింది.

కేసీఆర్ నాయకత్వంలో పిడుగులు కురిపించిన తెలంగాణ ఉద్యమానికి ఢిల్లీ పెద్దలు తలవంచక తప్పలేదు. డిసెంబరు 9న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంపై కేంద్రం ప్రకటన చేసింది. కృత్రిమ ఉద్యమాన్ని సృష్టించిన సమైక్యవాదులు ఎన్నో కుట్రలు చేసింట్రు. కేంద్రం వెనకకు పోయింది. అయినా వారి కుయుక్తులేవీ కేసీఆర్ పట్టుదల పోరాట పటిమ ముందు నిలబడలేకపోయాయి. చావునోట్లో తలపెట్టి, ప్రాణాలకు తెగించి కేసీఆర్ చేసిన పోరాటం చివరకు అంతిమ లక్ష్యాన్ని ముద్దాడి తెలంగాణ ప్రజల 60 ఏండ్ల స్వరాష్ట్ర కాంక్షను 2014 జూన్ 2 నాటికి సాకారం చేసింది. మహోజ్వలమై ప్రజారాసులను కదిలించిన దీక్షా దివస్ స్ఫూర్తిని నాటి మహోన్నత లక్ష్యాన్ని నేటి కీలక సందర్భంలో మనం స్మరించుకోవాల్సి ఉన్నది.

కుటుంబాన్ని సక్కదిద్దాలంటెనే ఆపసోపాలుపడుతున్ననేటి కాలంలో రాష్ట్ర సాధనకోసం పూనుకోవడం మామూలుది కాదు. కొట్లాడే ఇంటోనితోని కాల్లు గుంజే బయటోనితోని తట్టుకొని నిలబడడం ఎంత కష్టం. వచ్చిన తెలంగాణను సదిరి కుదురుకున్న దాకా కాపాడడం ఇంకెంత కష్టం. అది కేసీఆర్ తోని తప్ప సామాన్యులతో అయ్యే పనికాదు. త్యాగాల పునాదుల మీద తెచ్చుకున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానం పదేండ్లు నిండకముందే ఇంత గొప్పగా వెలుగులను విరజిమ్ముతున్నదంటే అల్లటప్పా వ్యవహారం కాదు. అది దీక్షాదక్షుడు, తెలంగాణ ఏకాత్మ కేసీఆర్ వల్లనే సాధ్యమైంది. అటువంటి తెలంగాణ నేడు అనివార్యమైన ప్రజాస్వామిక పరిస్థితుల్లో మూడోసారి ఎన్నికలకు పోతూ.. నాలుగు బజాట్లకాడ నిలబడ్డది.

**నవంబర్ 30 ఎన్నికలకు వొక రోజు ముందుగాల దీక్షా దివస్ వస్తున్నది. అదే స్ఫూర్తితో మరోసారి దీక్షాదక్షులుగా మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం తెలంగాణ సమాజానికి ఉన్నది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కలలు నిజమయ్యే కాలాన కాంగ్రెస్ గాలానికి చిక్కకుంటా తప్పుదారి మల్లించే చేతులను మనం పసిగట్టాల్సి ఉన్నది. ఎన్నికల పేరుతో ఐదేండ్లకోపాలి మన గడ్డమీదికొచ్చి మనలను రెచ్చగొట్టి మనలో ద్వేషాన్ని నింపిపోతున్న పరాయి రాష్ట్రాల టూరిస్టుల పట్ల వాళ్ల ఇక్కడి తొత్తుల పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇది.**

అరవై ఏండ్ల సంది మంది మాటలు నమ్మి మల్ల మల్ల ఆగమైన తెలంగాణ ఇప్పుడిప్పుడే కేసీఆర్ బాటల నడుస్తూ వొక దరికిచేరుకుంటున్నది. కుదురుకుంటున్న తెలంగాణను మల్లోపాలి చెదరగొట్టాలని చూడబోతున్న ద్రోహులను తరిమికొట్టాల్సిన స్ఫూర్తిని మనం దీక్షా దివస్ నుండి అందుకోవాల్సి ఉన్నది. తెలంగాణను బతికించిన నాటి కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో నేడు తెలంగాణను గెలిపించేందుకు తెలంగాణ సమాజం తిరిగి పట్టుబట్టవలసి ఉన్నది.

కలిసి పనిచేసే క్రమంలో ఉత్పన్నమయ్యే చిన్నచిన్న మనస్పర్థలు, భావోద్వేగాలు, అపార్థాలు, అసంతృప్తులను మనసుమీదికి తెచ్చుకోవద్దు. అడిగిందియ్యలేదని మన కుటుంబంల ఉన్నట్టే అలుగుడు గులుగుడు ఉంటయి. ఘర్షణ ఐక్యత దిశగా సాగాలె. బంధం బలపడేదిక్కుపోవాలి తప్ప బలహీన పడేందుకు కాదు. మనం ఇప్పుడు మన బలాలను పంచుకునే సందర్భంలో ఉన్నాం మన భావోద్వేగ బలహీనతలను కాదు. మన స్వీయ మానసిక ధోరణులను దూరం పెట్టి రేపటి మన పిల్లల భవిష్యత్తు పట్ల సామాజిక తాత్విక చింతనతో ఉండాలి. స్థిత ప్రజ్ఞతతో కూడిన దార్శనికతతో అందరం ఎప్పటోలిగనే ముందుకు సాగాలి. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష. అందుకే 2009 నవంబర్ 29 దీక్షా దివస్ స్ఫూర్తిగా, ఈ నవంబర్ 30న కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధి కొనసాగింపులో భాగస్వామ్యులమౌదాం.



**రమేశ్ హజారి**
**93909 19090**

---

## కేసీఆర్‌ది అభివృద్ధి పోరాటం

**తెలంగాణ రాష్ట్రం ఆరు దశాబ్దాల స్వప్నం. అసలు సాధ్యమైతదా...మన కండ్లతోని చూస్తమా? అనే సందేహాల రంగుల కల. రాష్ట్రం కోసం కొట్లాడని తరం లేదు. తనువెల్లా తెలంగాణవాదం నింపుకుని ఉద్యమంలో పోరాడి అసువులు బాసిన అమరులెందరో. కానీ.. తెలంగాణ రాష్ట్రం సాకారం కాలేదు. పోరాట స్ఫూర్తి ఆగిపోలేదు. 'మీ బాట సాగుతాము అమరులారా' అంటూ ప్రతీ తరం తమవంతుగా కొట్లాడింది. కానీ... సమైక్యవాదుల కుట్రలు, ప్రతిదశలో కాంగ్రెస్ మోసాలతో ఉద్యమం నయవంచనకు గురైంది.**

ఆశలు కోల్పోయిన తెలంగాణ జనాలకు మళ్లీ ఆశలు చిగురింపచేసిన తెలంగాణ యోధుడు సీఎం కేసీఆర్. అడుగడుగునా ఆటంకాలు ఎదురైనా ఎదురునిలిచి పోరాడిన ఘనత కేసీఆర్‌ది. యావత్తు రాష్ట్రాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి...ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించి చూపారు. తెలంగాణ రాష్ట్రం కేవలం భౌగోళిక తెలంగాణ కాదు. బతుకులు బాగుపడే తెలంగాణ. ఉద్యమం జరుగుతున్నప్పుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఇదే విషయం పదేపదే పలు వేదికలపై చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాధించిన రాష్ట్రాన్ని సగర్వంగా నిలబెట్టేలా ప్రణాళికలు రచించారు కేసీఆర్.



**తెలంగాణ రాష్ట్రం...మిగిలిన రాష్ట్రాలకు పూర్తిగా భిన్నం. అరవై ఏండ్లపాటు అణచివేతకు గురైన తెలంగాణకు తిరిగి పునరుజ్జీవం కలిగించడం పాలకుల కర్తవ్యం. తెలంగాణ పునర్నిర్మాణం అంటే... అరవై ఏండ్ల సంక్షోభం నుంచి బయటపడ్డ తెలంగాణ ఏ దిశలో సాగాలో ఆలోచించే నాయకత్వం అవసరం. అలాంటి నాయకత్వం కేసీఆర్ సొంతం.**

సాధించిన తెలంగాణను బాగు చేసే ఉద్దేశంతో విద్య, వైద్య, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లోనూ ఏం చేయాలో కూడా ప్రణాళికలు, పథకాల్ని తయారు చేశారు కేసీఆర్. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వంలోనే కేసీఆర్ భావి తెలంగాణకు బాటలు వేశారు. ప్రత్యేక రాష్ట్రంలో ఏర్పడిన తొలి ప్రభుత్వం చాలా కీలకం. అందుకే కేసీఆర్ నిపుణుల సలహాలు తీసుకుంటూ ముందుకు అడుగులు వేశారు. పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాల తెలంగాణగా మార్చి పాలనను ప్రజల చెంతకు చేర్చారు. సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. పిల్లలు పౌష్టికాహారంతో కూడిన టిఫిన్, మధ్యాహ్నం సన్నబియ్యం అన్నం తింటున్నారు. పేదలకు నాణ్యమైన విద్య చేరువయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయి. కేసీఆర్ పాలనలో పల్లె నుంచి పట్నం వరకు దవాఖానాలు కొలుకున్నాయి. పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు, జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటయింది. పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, నర్సరీలు, వైకుంఠధామాల్ని ప్రభుత్వం నిర్మించింది.

సమైక్య పాలనలో నీళ్లు లేక బీడువారిన నేలలు, నేడు పచ్చని మాగాణంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కర్షకుల కన్నీళ్లు తుడిచింది. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు, ఆపతికాలంలో ఆదుకునేందుకు రైతుబీమా వంటి పథకాలు పల్లెల్లో అన్నదాతల్లో ఆనందం నింపాయి. సమాజంలో ఆపన్నులైన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఫించన్లు అందిస్తూ..వాళ్ల పాలిట కేసీఆర్ దేవుడిగా, పెద్ద కొడుకుగా నిలిచారు. పేదింటి బిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు.

తెలంగాణ గోస తెలిసిన కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ బాగుపడుతుందని నమ్మిన ప్రజలు రెండు సార్లు అధికారం కట్టబెట్టారు. మన బతుకులు, భావితరాల భవిష్యత్ కేసీఆర్ చేతుల్లోనే సురక్షితంగా ఉంటుందని జనం నమ్ముతున్నారు. కేసీఆర్ మన బ్రతుకులు బాగు చేసే బ్రహ్మాస్త్రం. ప్రజా ఆశీర్వాదంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు.



**ఇనుగుర్తి సత్యనారాయణ**
**97046 17343**

---

### తెలంగాణ తీర్పు

ఊట నీరు తీపి
తెలంగాణ భాష, యాస
తనువు పులకరించు తంగేడులా
వరి గొలుసు వర్ణం
తెలంగాణ మాగాణి మట్టి మహిమ
కడుపు నింపు దేశానికే అన్నపూర్ణమ్మ
సమశీతోష్ణస్థితి వాతావరణం
అనుకూలం అన్ని రకాల పంట సాగుకు
పసుపు, కారం, పత్తి, పట్టు రైతుకు రొక్కం

నల్ల బంగారం తల్లిగర్భంలో
తవ్విన కొద్దీ తరలి వచ్చే సంపద
కార్మికుల జీవన వెలుగులు కొండంత
మినీ ఇండియా అవతారం
ఐటీ, మల్టీమీడియా రంగాల రాక
కదిలివచ్చిరి తూర్పు పడమరల నుంచి
మతాలు మతలబులు పక్కన పెట్టి
గంగాజమున కలయికలా
మనుషులు

అలాయ్ బలాయ్ సంగమ సంస్కృతి
తెలంగాణ తీర్పు స్పష్టం
మంచి చెడును వేరు చేసే హంస గుణం
మళ్లీమళ్లీ చరిత్ర పునరావృతం...



**దాసరి మోహన్**
**99853 09080**

---



## సెంచరీ దిశగా బీఆర్ఎస్

**కేసీఆర్ అంటే జన సునామీ.. ఉద్యమకాలం నుంచి కేసీఆర్ ప్రసంగాలకు మైమరచిపోని వారు లేరు. ఆయన ప్రసంగాలకు విపక్షాలే అబ్బురపడతాయి. రెండు పర్యాయాలు జనరంజకపాలన అందించిన సీఎం కేసీఆర్‌కు మాత్రమే తెలంగాణ ప్రజలకు ఏం కావాలో తెలుసుననేది అందరి అభిప్రాయం.**

**కేసీఆర్‌ను పట్టుకోవడం, అంచనా వేయడం అసాధ్యమైన విషయం. కేసీఆర్ అమ్ములపొదిలో ఉండే అస్త్రాలు వాటికి వచ్చే జనామోదం ఉద్యమకాలం నుంచి చూస్తూనే ఉన్నాం. కేసీఆర్‌ను తట్టుకోవటం కష్టమని విపక్ష నాయకుల అభిప్రాయం. 'ఎన్నికల్లో తాను ఇచ్చిన మాటకు కేసీఆర్ ఏ స్థాయిలో విలువ ఇచ్చి దాన్ని అమలు చేసేందుకు ఎంత వరకైనా వెళుతారని' ప్రతిపక్ష నాయకులు విశ్లేషిస్తారు.**

విపక్షాల అంచనాలు తలకిందులు చేసే కేసీఆర్ వ్యూహం అంచనా వేయటం విపక్షాలకు అంతు చిక్కదని మరోసారి స్పష్టమైంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాదు గత తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చేపట్టిన విప్లవాత్మక చర్యలు తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకు వచ్చాయి. 2014,2018 శాసనసభ ఎన్నికల్లో అనుసరించిన ప్రచార వ్యూహాన్నే ఈసారి కూడా కేసీఆర్ ఆచరిస్తున్నారు. ఏడుపదుల వయస్సులోను అలుపెరుగని వాగ్దాటి, ఆయన మాటే ఉప్పెన, అదే కేసీఆర్ ఆయుధం.

గత రెండు పర్యాయాలు జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రాన్ని చుట్టేసిన కేసీఆర్ తాజా ఎన్నికల ప్రచారంలో చేసింది చెప్పి ఓట్లు అడిగే చేవ కలిగిన నేతగా ప్రజలు అభిమానిస్తున్నారు. జనాన్ని ఒప్పించే కేసీఆర్ ప్రసంగం, మెప్పించే చాతుర్యం ఓటర్లను ఎంతగానో ఆకర్షిస్తున్నది. 'ఇంటికి ఒక బిడ్డను ఇవ్వాలని అడిగిన..పద్నాలుగేండ్లు పోరాడి తెలంగాణను తీసుకువచ్చి మీపాదాల ముందు ఉంచిన. రాష్ట్రాన్ని కాకులకు, గద్దలకు వేద్దామా? ఈనగాచి నక్కలపాలు చేద్దామా? సాధించుకున్న తెలంగాణను మనమే తీర్చిదిద్దుకోవాలె.. ఆలోచించండి.. మన తెలంగాణను మనమే నిర్మించుకుందాం రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంటే మన రాజ్యం అవుతుంది. మన కల సాకారం చేసుకుందా'మంటూ కేసీఆర్ చేసే ప్రసంగాలు ప్రజలను ఆలోచనలో పడవేస్తున్నాయి.

కేసీఆర్ గొంతు వింటే ఒక ధైర్యం...ఆయన మాట్లాడితే ఒక భరోసా.. పిడికిలెత్తి నినదిస్తే ఒక ఉత్సాహం. నాయకుడికి నిర్వచనం అడిగితే కేసీఆర్ పేరు ఒకటి చాలు.అందుకే తెలంగాణ ప్రజలు ఆయన వెన్నంటి నిలిచారు. వెంట నడిచారు. కేసీఆర్‌కు పదవులంటే లెక్కలేదు. అందుకే తెలంగాణ కోసం పలుమార్లు రాజీనామా పత్రమై రణగర్జన చేశారు. ఎన్నికలంటే ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. తెలంగాణ ప్రజలపై ఆయనది చెక్కుచెదరని నమ్మకం. ప్రజలకూ ఆయనపై అచంచల విశ్వాసం. అంతులేని అభిమానం. అధికారిక సమావేశాల్లో రాజనీతిజ్ఞుడిగా విషయపరిజ్ఞానంతో మాట్లాడే కేసీఆర్ ఎన్నికల ప్రచార సమరాంగణంలో బక్కపలచని యుద్ధభేరిగా మారిపోయారు.

బహిరంగసభ కేసీఆర్ బహుముఖ ఆయుధం. అందుకే ఒక్కో బహిరంగ సభ ఒక జన సునామీ. ఆసభల్లో కేసీఆర్ మాటలు ప్రత్యర్థులపై మరఫిరంగులై పేలుతాయి. తెలంగాణను స్వప్నించి సాధించిన కేసీఆర్ గత తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని బంగారు తునకగా మార్చారు. మూడో మలుపులో గెలుపు పిలుపు కోసం రణన్నినాదం చేస్తున్నారు. చెప్పింది చేసే కేసీఆర్ చేసింది, చేయబోయేది ప్రజలకు వివరిస్తున్న తీరు ఓటర్లను ముగ్ధులను చేస్తున్నది. ఆయన ప్రచారతీరు జనం గుండెల్లో గులాబీ జెండా ఎగురవేస్తున్నది.

ఒక వైపు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో విపక్షాల మైండ్ బ్లాంక్ చేసిన గులాబీ బాస్ ప్రచారం లో విపక్షాలపై అస్త్రశస్త్రాలను సంధిస్తూ దూసుకు పోతున్నారు. యోధుడి సుడిగాలి పర్యటనతో రాష్ట్రమంతటా బీఆర్ఎస్ గెలుపు నల్లేరు మీద నడకగా మారింది. ఎవరెన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని రెండు ఎన్నికలు నిరూపించాయి. ఇప్పుడు అదే చరిత్ర పునరావృతమవుతుందనేది నిర్వివాదాంశం. ఈసారి తప్పకుండా సెంచరీ కొట్టడం ఖాయంగా కనిపిస్తున్నది.



**కోలేటి దామోదర్**
**98491 44406**

(వ్యాసకర్త : తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్)

---

## మూడోసారి గులాబీ సర్కారు

**తెలంగాణ రాష్ట్రంలో 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో జరిగిన చర్చ తెలంగాణ అభివృద్ధి వాదులను ఒకింత ఆందోళనకు గురి చేసింది. ప్రజల్లో టీఆర్ఎస్ పట్ల కాస్త వ్యతిరేకత ఉన్నట్లు కనిపిస్తోంది ఈసారి కష్టమే అని. ఇట్లాంటి మాటలు మీడియాలో, బయటా చక్కర్లు కొట్టాయి. ప్రజల్లో వచ్చిన అసంతృప్తే దీనికి కారణమని ఎవరికి వారే తీర్పులిచ్చారు. ఇవన్నీ చూసిన అభివృద్ధివాదుల అప్పటి ఆందోళన వాస్తవమైందే. కానీ ఓట్లు వేసేటప్పుడు గుర్తుంచుకుని మరీ కారుపై వేసి 88 సీట్లల్లో గెలిపించి మరోసారి ప్రగతి పాలనకు ప్రజలు పట్టం కట్టారు. నాటి తెలంగాణ రాష్ట్రసమితి నేటి భారతీయ రాష్ట్రసమితి సరికొత్త అభివృద్ధి నమునాను ప్రజల ముందుకు తీసుకొచ్చింది.**

తొలి విడత కేసీఆర్ పాలనా కాలంలో ఎవ్వరికీ పెద్దగా అర్థం కాలేదు. కానీ తమ జీవితాల్లో మంచి మార్పే జరుగుతున్నట్టుందనే అనుభవం వారికి వచ్చింది. ఎవరు తమకు మేలు చేస్తారు. ఎవరు మాటలు చెప్తారనే విషయాలను చాలా స్పష్టంగా తెలంగాణ సమాజం గుర్తించింది.తాజాగా ప్రజలు బీఆర్ఎస్ పాలన పట్ల గులుగుతున్నారనే చర్చ జరుగుతున్నది. మునుపటి ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటెందుకు వేశారు? వారు గుర్తించిన అంశాలేమిటి? మరి ఇప్పుడు గులుగుడు విషయం ఎందుకు వచ్చింది? ఇలాంటి సందేహాలకు సమాధానాలు చాలా సులభంగానే దొరుకుతాయి. తెలంగాణ ప్రజల ఆలోచనను లోతును అర్థం చేసుకోవాలంటే ముందుగా కేసీఆర్ ఆలోచనను ప్రజలు అర్థం చేసుకున్న తీరు తెలియాలి. ఇది తెలిస్తే గులుగుడు వెనుకున్న కారణాలు తెలుస్తాయి. ఇంతకు ముందెప్పుడూ తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధి గురించి ఆలోచించిన నాయకులు లేరు.



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సకల జనుల సర్వే నిర్వహించారు. ఉద్యమ సమయంలో తాను అధ్యయనం చేసిన సమస్యలకు పరిష్కారాలను ప్రజల ద్వారా తెలుసుకునే గొప్ప ప్రయత్నం చేశారు. ప్రజల వాస్తవ జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. అందుకు అనుగుణమైన ఆర్థిక నమూనాను తయారు చేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగుచేసి గ్రామ ఆర్థిక వ్యవస్థకు జీవం పోశారు. ఆ తర్వాత రైతుబంధు పథకం తీసుకొచ్చారు. సాగునీటి రంగంలో సమూల మార్పులకు నాంది పలికారు. ఐదేండ్ల కాలంలో కొన్ని ఫలితాలు సాధించారు. ఆ తర్వాత ఇంక చేయడానికి ఏముంది? కొత్తగా ఏముంటుంది? ఇట్లా కొందరు ప్రచారాలు ప్రారంభించారు.

అసలు విషయం ఇక్కడే ఉంది. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పటికే లక్షలాది మందికి వచ్చాయి. కేసీఆర్ పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. అందుకున్నవారు ఆనందంగా ఉంటే అందుకోనివారు గులుగుతున్నారు. అయితే ఒకేసారి అందరికీ ఇవ్వడం సాధ్యం కాదు కనుక మరోసారి కేసీఆర్ సీఎం అయితే తమకూ వస్తుందనే ఆశ మాత్రం వారిలో సజీవంగా ఉన్నది. ఆ ఆశనే గులిగేవారి చేత కారు గుర్తుపై ఓటేసేలా చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ విషయాన్ని చెప్పింది ఎవరో కాదు 'ప్రజా ఆలోచన వేదిక' వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు.

కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రజాకర్షక పథకాలని, అవి నేడు సత్ఫలితాలిస్తున్నాయని, కాకపోతే అర్హులైన లబ్ధిదారులందరికీ ఒకేమారు అందకపోవడం వల్లే ఈ గులుగుడు సమస్య తలెత్తుతుందని ఆయన పేర్కొన్నారు. ఆ పథకాలు కొనసాగి అందరిదరి చేరాలంటే తిరిగి మరొక్కమారు కేసీఆర్ సర్కార్ రావాల్సిందేనని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన చెప్పారు.

ఆచరణ సాధ్యం కాని ప్రతిపక్షాల హామీలను ప్రస్తుతం తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధిని కండ్లారా చూసిన ఇక్కడి ప్రజానీకం దూద్ కా దూద్, పానీకా పానీ తెలుసుకోలేని స్థితిలో లేరనేది వాస్తవం. దళితబంధు, బీసీబంధులాంటి పథకాల విషయంలోనూ ఇదే వరుస.వచ్చినవారు కారు గుర్తుకు ఓటేసేందుకు సిద్ధమయ్యారు. ఇక రానివారు తమకు తప్పక వస్తుందనే ఆశతో ఉన్నారు. ఒక వేళ మరెవరైనా తప్పిదారి అధికారంలోకి వస్తే మొత్తానికే మోసం వస్తుందనే అభిప్రాయంతో కూడా తెలంగాణ ప్రజలు ఉన్నారనే విషయం చర్చకు రావడం గమనార్హం. ఇదే వరుస అన్ని పథకాల విషయంలోనూ కనిపిస్తున్నది. వీటికి తోడు మరికొన్ని అంశాలు కూడా ప్రజలను కారు గుర్తు వైపుకు కదిలేలా చేస్తున్నాయి. తెలంగాణ ప్రజలు మాత్రం తమ జీవితాల్లో వచ్చిన మార్పును ఇప్పుడు అనుభవ పూర్వకంగా చూస్తున్నారు. వాస్తవిక అనుభవానికి, చిన్నపాటి మానసిక సంఘర్షనను సమాజపు ఆలోచనగా చూపిస్తూ వ్యతిరేకత అనే విషయాన్ని కొంతమంది తెరపైకి తీసుకొచ్చారు.

ఈ మధ్య తెలంగాణలో ప్రముఖ కవి ఒకరు ఒక సందర్భంలో చెప్పారు. 'తాము సాహిత్యాన్ని సృష్టించేందుకు వస్తువుల కొరత ఏర్పడిందని. అంటే గతంలో తెలంగాణలో కరువు మీద, వలసల మీద. ప్రభుత్వ నిర్బంధాల మీద, తెలంగాణ యాస, గోస మీద ఒకటేమిటి జీవితపు సంఘర్షణలన్నింటినీ కథలు, కవిత్వం, పాటలుగా మలిచేవారు. ఇప్పుడు జీవితాల్లో కొత్త మార్పులు వచ్చాయి. విధ్వంసం స్థానంలో అభివృద్ధి వచ్చి చేరుతున్నది.

**గులుగుడు ప్రభావం ప్రబలంగా ఉంటే ఇప్పటికే సాహిత్యరూపంలో ప్రభుత్వ వ్యతిరేకత వ్యక్తమయ్యేది. వందలాది మంది కవులు, రచయితలు తమ కలాలకు ఎప్పుడో పని చెప్పేవారు. అలాంటి స్పందనలు లేవంటే ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, గులుగుతూనే కారు గుర్తుపై ఓట్లు గుద్దుతారనే విషయం నిజం కాబోతున్నది. ఇప్పుడు తెలంగాణ మారుతున్నది. మార్పునకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. అందుకే ప్రజలు కేసీఆర్ వెన్నంటి ఉన్నారు.**

ఇక్కడ మరో విషయం గుర్తించాలి. ఈ మధ్య కేటీఆర్ ఓ మాట పదే పదే అంటున్నారు. గతంలో తాము మెజారిటీ ప్రజల అభీష్టానికి విరుద్ధంగా ఏమైనా నిర్ణయాలు తీసుకొంటే వాటిని పునః సమీక్షించి సరిదిద్దుకుంటామని.

వీటన్నింటిని ప్రజలు గుర్తిస్తున్నారు. అందుకే నాటి ఉద్యమకారులంతా మళ్లీ ఉద్యమ నాయకుడు కేసీఆర్ వద్దకు చేరుకున్నారు. ఈ సమీకరణాలన్నింటిని కూడా తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఈసారి కూడా మునుపటిలాగే గులుగుతూనే కారు గుర్తుపై ఓటేస్తారని తేలిపోయింది. అంటే గులుగుడు గులుగుడే గుద్దుడు గుద్దుడే అని.



**ఆస్కాని మారుతి సాగర్**
**90107 56666**

---

### దార్శనిక నేతకు
## ఓటు దండాలు

**తెలంగాణ ప్రజలు మరోసారి తమ చరిత్రాత్మక తీర్పుతో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు అధికారం కట్టపెడుతున్నారు. అంతే కాదు, ఇప్పటికే వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించిన తెలంగాణ సమాజం వచ్చే పదేండ్లలో మరింత అభివృద్ధి దిశగా పరుగులు తీయడానికి నేటి ప్రజాతీర్పు శ్రీకారం చుట్టనున్నది.**

ఒకప్పుడు తెలంగాణలో పనుల్లేక పొట్టచేత పట్టుకొని బొంబాయి, దుబాయి పోయేది. కడుపు నిండా తిండిలేక, కంటి నిండా కునుకు లేక బతికేది. కానీ, తొమ్మిదేండ్లలో తెలంగాణ ఎంత మారిపోయింది! మంచి నీటికి బాధలేదు. సాగునీటి కలవరం లేదు. కరెంటుకు కొదువ లేదు. సడక్‌లు బాగుపడ్డయి. వృద్ధులకు ఆసరా పింఛన్ వస్తున్నది. ఎరువులు, విత్తనాలు దొరుకుతాయో లేదో అనే రంది లేదు. రైతుబంధుతో రైతుల కష్టాలు తీరాయి. వ్యవసాయ సంక్షోభం తొలగిపోయింది. దేశానికే అన్నం పెట్టే స్థితికి చేరుకున్నం. ఇవన్నీ ఆగకూడదు.మనం ఇంకా ముందుకు పోవలసి ఉన్నది.

ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసింది. ఈ సమితులకు సమావేశ మందిరాలను, నిధులను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యవసాయ విస్తరణ అధికారులను కూడా పెద్ద ఎత్తున నియమించింది. రైతులు మార్కెట్ పరిస్థితులను బట్టి రాష్ట్రస్థాయి వరకు తమ సమస్యలు చర్చించుకొని పరిష్కారాలు సాధించవచ్చు. వ్యవసాయం ఒక్కటే కాదు, గ్రామీణ వృత్తులన్నీ పునరుజ్జీవం పొందేందుకు కేసీఆర్ కృషి చేశారు. గొల్లకుర్మలకు లక్షలాది గొర్రెలు ఇచ్చారు. ఉచిత చేపపిల్లలతో చెరువులు నింపారు. చేపలను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా భారీ లాభాలు పొందవచ్చు. గొర్రెలతో పాటు మాంసం ఎగుమతి చేయవచ్చు

స్వయం సహాయక బృందాల్లోని లక్షలాది మంది మహిళలు వడ్డీలేని రుణాలు తీసుకుని ఆర్థిక స్వావలంబన సాధించారు. రేపు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, చేతి వృత్తుల ఆధారంగా పరిశ్రమలు వస్తే వీరి శక్తిని మరింతగా ఉపయోగించుకోవచ్చు. ఐటీ రంగం జిల్లాలకు విస్తరించింది. దీనిద్వారా దేశ విదేశాల్లో తెలంగాణ బిడ్డలు శాసించే స్థితిలో ఉంటారు.

కేసీఆర్ మానవీయ సంక్షేమంతో గ్రామీణులకు, పేదలకు, పిల్లలకు, వృద్ధులకు, మహిళలకు, యువతకు ఇలా అన్ని వర్గాల వారికి అవకాశాలు అందివస్తున్నాయి. ఆ ఒరవడి కొనసాగాలంటే మళ్లీ అధికారం కట్టబెడుదాం.



**గోసుల శ్రీనివాస్ యాదవ్**
**98498 16817**